**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 52, పేజీలు - 08

మంగళవారం, ఆగష్టు 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు నిర్వహిస్తాం

### - సనత్ నగర్ టిమ్స్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం రేవంత్
- కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తామని హామీ
- అన్ని ఆస్పత్రులు పూర్తయితే 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని అంచనా





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదవాడికి వైద్యం భారం కాకూడదు, ప్రభుత్వ ఆసుపత్రి అంటే నాణ్యమైన వైద్యం, నమ్మకమైన భరోసా కావాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ రంగాలపై చేసే ప్రతి రూపాయి వ్యయాన్ని భవిష్యత్తుపై పెట్టే విలువైన పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టీమ్స్) ఆస్పత్రిని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1000 పడకలతో 2లో..

## జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించిన బీజేపీ

### - కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు

- పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్ష పదవులు
- విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యత
- స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, 2లో..

## అది అధికారుల తప్పిదమే, బాధితులకు క్షమాపణలు

### - 22ఏ నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి ప్రకటన

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని సూచన
- 22ఏలో ఉందని దరఖాస్తు తిరస్కరించొద్దని ఆదేశం
- భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులకు ఎలాంటి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారుల తప్పిదాల కారణంగా కొన్ని ప్రైవేటు భూములు 22ఏ నిషేధిత జాబితాలో చేరాయని.. వాటిని పరిశీలించి న్యాయబద్ధమైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 22ఏ భూములపై మంత్రి పొంగులేటి వివరాలు 2లో..

## కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

### - 20 మందికి గాయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొండగట్టు ఆలయం వద్ద వేగంగా వచ్చిన ఒక లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కనీసం 20 మంది ప్రయాణికులు గాయపడగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయి డ్రైవర్ లోపలే చిక్కుకుపోయాడు. అతనిని బయటకు తీసేందుకు 2లో..

## ఎల్‌నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

### - వరి వేయడానికి రైతులకు సూచనలు

- నవంబర్ వరకు అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంచనా
- శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా తగ్గిన నీటి ప్రవాహం
- నీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్న సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాది భారత్‌లో పలు రాష్ట్రాల్లో ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆగస్టు నెల సగం పూర్తయినా లోటు వర్షపాతం కారణంగా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో తీవ్ర ప్రభావం, నీటి సంక్షోభంపై మాట్లాడుతూ ఈ ఏడాది 35.5 శాతం లోటు వర్షపాతం ఉంటుందని నిపుణులు అంచనా వేశారని రైతులకు కీలక సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నీటి లభ్యత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. లోటు వర్షపాత పరిస్థితుల కారణంగా రైతులు అన్ని ప్రాంతాల్లో వరి వేసి ఇబ్బంది పడొద్దని సూచించారు.

**గోదావరి బేసిన్ మినహా ఇతర ప్రాంతాల్లో వరి వద్దు!**

గోదావరి నదికి మాత్రమే కొంత వరద నీరు వస్తోందని తెలిపారు. కనుక 2లో..

## టైమ్,ప్లేస్ మీరే డిసైడ్ చేయండి.. చర్చకు నేను సిద్ధం

### - అసెంబ్లీలో పంచ్ డైలాగులతో మంత్రి నారా లోకేశ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** మెగా డీఎస్సీపై తాను చర్చకు సిద్ధం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీలో డీఎస్సీ నిర్వహణపై కీలక ప్రసంగం చేశారు. డీఎస్సీని ఎంతో ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేసినట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీని అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు చేసిందని చెప్పుకొచ్చారు. కోర్టులో కేసులు వేసిన చరిత్ర వైసీపీది అని ధ్వజమెత్తారు.డీఎస్సీ నిర్వహణపై తాను ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తేదీ, సమయం ఖరారు చేయండి. చర్చకు నేను సిద్ధం. సభలోపలైనా సభ వెలుపలైనా ఎక్కడైనా నేను సిద్ధం అని మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు.

**డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది**

ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డీఎస్సీ నిర్వహణపై కీలక వ్యాఖ్యలు చేశారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతగా తీసుకుని నిర్వహించిందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీ మేరకు ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, ఈ క్రమంలోనే ఏకంగా 148 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియను విజయవంతంగా 2లో..

## ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా విడుదల

### - 92 లక్షల మందికి నోటీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో సుమారు 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నారు. దీంతో తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందా లేదా అనే అంశంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. నిర్ణీత గడువులో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది వివరాలతో ముసాయిదా ఓటర్ల జాబితాను రూపొందించినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. మొత్తం మీద 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలను పరిశీలించగా.. సుమారు 73 లక్షల మంది ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు సుమారు 2లో..

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

### - 22ఏ నిషేధిత భూములపై హరీశ్‌రావు ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా 22ఏ నిషేధిత జాబితాలో ఉందని హరీష్ రావు ఆరోపించారు. సీఎం ఆస్తి కూడా ఈ జాబితాలో ఉండటంతోనే రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా 22ఏ అంశాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. అయితే ఇది హరీశ్‌రావు చేసిన ఆరోపణలే కావడం గమనార్హం. 2లో..

## రాహుల్ గాంధీకి సుప్రీంలో రిలీఫ్

### - ఇప్పటి వరకు ఎందుకు మౌనంగా ఉన్నారు? - రాహుల్ గాంధీ ఆస్తుల కేసులో సీబీఐ,ఈడీలపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టు విచారణను నిలిపివేయాలని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి నివేదికలను దాఖలు చేయవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థలను అత్యున్నత న్యాయస్థానం సోమవారం ఆదేశించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను నిలిపివేయాల్సి అలహాబాద్ హైకోర్టుకు ఆదేశాలు జారీచేసింది. ఇదే సమయంలో సీబీఐ, ఈడీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ గాంధీపై ఆరోపణలు అంత తీవ్రమైనవి అయితే ఇప్పటి వరకూ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించింది.

రాహుల్ గాంధీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, పిటిషనర్ విగ్నేష్ శిశిర్ వేసిన 2లో..

## ఝార్ఖండ్‌లోనూ విద్యార్థులదే పైచేయి.. దిగొచ్చిన ప్రభుత్వం

### - జేఎస్ఎస్ సీ-సీజీఎల్ పరీక్ష రద్దు



రాంచీ (ప్రశ్న న్యూస్) ఝార్ఖండ్‌లో ఉద్యోగార్థులు, విద్యార్థులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. పేపర్ లీకేజీ, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు 2లో..

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు నిర్వహిస్తాం

నిర్మించిన ఈ ఆసుపత్రికి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నేటి రోజుల్లో ప్రైవేటు వైద్యం సామాన్యులకు అత్యంత ఖరీదుగా మారిందని, అందుకే ప్రతి పేదవాడికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్‌స్పెషాలిటీ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.2,700 కోట్లకు పైగా నిధులను విడుదల చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల ఆరోగ్యంతో పాటు వారి వద్దకు వచ్చే బంధువులు, సహాయకులకు వసతి, ఆహార సౌకర్యాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. నర్సింగ్ విద్యార్థులకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉందని, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు మన నర్సింగ్ సిబ్బంది సేవలను ఆహ్వానిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టిన భారీ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించి, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని రీతిలో వీటిని నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ ఆస్పత్రుల్లో రోగుల సేవల్లో 70 శాతం పాత్ర నర్సింగ్ సిబ్బందిది కాగా, మిగిలిన 30 శాతం డాక్టర్లది ఉంటుందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్దేశిత సమయం కంటే అదనంగా బాధ్యతలు నిర్వర్తించే స్పెషలిస్ట్ వైద్యులకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు అందిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలపై ఆధారపడటం కంటే ప్రతి పౌరుడు స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో బతికేలా అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా?. టిమ్స్ లు కట్టింది మేం అని కేటీఆర్ వచ్చి చెప్పి వెళ్లారు. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా?. మీరు అధికారంలో ఉన్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు? అని రేవంత్ ప్రశ్నించారు.

### పదేళ్లలో బీఆర్ఎస్ ఖర్చు చేసింది రూ.70 కోట్లు

టిమ్స్ హాస్పిటల్ కి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో ఖర్చు పెట్టింది కేవలం 70 కోట్లు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్ల లో టిమ్స్ హాస్పిటల్ కోసం 1,126 కోట్లు కర్చుపెట్టిందన్నారు. సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రికి మర్రి చెన్నారెడ్డి పేరును ఖరారు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో సీఎంకి నాదొక విజ్ఞప్తి తెలంగాణ సాధన కోసం తన మంత్రి పదవిని సైతం వదులుకుని, 94 ఏళ్ల వయసులో ఢిల్లీలో ఎముకలు కొరికే చలిలో దీక్ష చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఎల్బీనగర్ టిమ్స్ కు పెట్టాలని కోరారు. అలాగే, అల్వాల్ టిమ్స్ కు అంజయ్య పేరును, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరును కూడా పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల పేర్లను ప్రజలకు సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రులకు పెట్టడం వారికి అందించే ఘనమైన నివాళి అన్నారు.

# జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించిన బీజేపీ

ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు. తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

# ఎల్‌నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

గోదావరి బేసిన్ మినహా మిగిలిన ఏ ప్రాంతంలోనూ వరి పంటలు వేస్తే, పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఈ విషయాన్ని రైతులు గ్రహించి నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదవుతుందని రైతులు అర్థం చేసుకుని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూనే, పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెడతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిపుణుల అంచనాల ప్రకారం ఈ ఏడాది దాదాపు 35.5 శాతం మేర లోటు వర్షపాతం నమోదు కానుందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులతో పాటు పెన్నా బేసిన్ వ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, కొన్ని జిల్లాల్లో లోటు వర్షపాతం 42 శాతానికి చేరిందన్నారు.

### నీటి కొరతతో రాష్ట్రాల మధ్య వివాదాలు

నీటి కొరత వల్ల రాష్ట్రాల మధ్య వివాదాలు, విభేదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా ఏపీ ప్రభుత్వం నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలో కూడా వర్షపాతం తగ్గడంతో అక్కడి రిజర్వాయర్లు నిండిన తర్వాతే మన రాష్ట్రానికి నీరు వస్తుందని తెలిపారు. దీనివల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు నీటి ప్రవాహం భారీగా తగ్గిందని ఆయన వివరించారు. ఉదాహరణకు శ్రీశైలానికి సాధారణంగా రావాల్సిన 753 టీఎంసీల నీటికి గాను ఈ ఏడాది కేవలం 214 టీఎంసీలు మాత్రమే వచ్చాయని తెలిపారు. జూన్ నుంచి డిసెంబర్ మధ్య సాధారణంగా పడాల్సిన 867 మిల్లీమీటర్ల వర్షపాతానికి బదులుగా కేవలం 557 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందన్నారు. జులై నుంచి నవంబర్ వరకు 20 శాతం నుండి 68 శాతం వరకు లోటు వర్షపాతం ఉంటుందని, డిసెంబర్‌లో మాత్రమే స్వల్పంగా సాధారణ వర్షపాతం ఉండవచ్చని వివరించారు. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుందని కొన్ని జిల్లాల్లో జులైలో 68 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో 35 శాతం, సెప్టెంబర్ నెలలో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్ నెలలో 20 శాతం మేర లోటు వర్షపాతం నమోదు కానుందని అంచనాలు వివరించారు. నీటి కొరత ముప్పు తీవ్రంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

స్థానికులు ఇనుప రాడ్లు, తాళ్లను ఉపయోగిస్తూ 30 నిమిషాలకు పైగా శ్రమించాల్సి వచ్చింది. కరీంనగర్ 1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల వైపు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో విషాదం నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో దాదాపు 60 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన తరువాత బాధితులు సహాయం కోసం కేకలు వేశారు. ఒక ప్రత్యక్ష సాక్షి మీడియాతో మాట్లాడుతూ, 'మేం పెద్ద శబ్దం రాగానే విని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాం. బస్సు డ్రైవర్ శరీరం నుంచి రక్తం కారుతోంది. బస్సు లోపల ప్రయాణికులు చిక్కుకుపోయారు' అని తెలిపారు.

### కొండగట్టు హైవేపై రోడ్డు ప్రమాదం

మల్లియల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు గుట్టపై ఉన్న ఆలయానికి వెళ్లే మార్గంలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు దర్శనం కోసం వస్తుంటారు. ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురు ఢీకొన్న ప్రమాదంలో బస్సు ముందు భాగం తీవ్రంగా ధ్వంసమైంది. కొన్ని నిమిషాల్లోనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బయటకు తీసేందుకు కిటికీలు పగలగొట్టారు. వీరిలో 20 మందిని చికిత్స అందించేందుకు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారికి మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలిస్తున్నారు. క్యాబిన్‌లో చిక్కుకుపోయిన లారీ డ్రైవర్‌ను కొంతసేపు శ్రమించి బయటకు తీయగలిగారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మోటారు వాహనాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘాట్ రోడ్డు దిగుతున్న సమయంలో లారీ అదుపు తప్పి బస్సు లేన్‌లోకి వచ్చి ఉంటుందని ప్రాథమిక విచారణలో తేలింది. లారీ వేగం, బ్రేకులు ఫెయిల్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

## టైమ్,ప్లేస్ మీరే డిసైడ్ చేయండి..

# చర్చకు నేను సిద్ధం

పూర్తి చేసినట్లు మంత్రి నారా లోకేశ్ సభలో వెల్లడించారు. డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది అని మండిపడ్డారు. కులం,మతం పేరుతో వైసీపీ రాష్ట్రంలో చిచ్చు పెడుతుంది అని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సభకు రాలేదు, జగన్ అనే వ్యక్తి డా.బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నారు అని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు.

### కోర్టు ఆదేశాల మేరకే రిజర్వేషన్ల అమలు

డీఎస్సీ నియామకాల ప్రక్రియపై విభిన్న అభిప్రాయాలు ఉన్నవారు న్యాయస్థానాలలో 336 కేసులు దాఖలు చేశారని మంత్రి నారా లోకేశ్ గుర్తుచేశారు. నియామకాల్లో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పాటించాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేశామని మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించారు. అలాగే టెట్ పరీక్షకు 3.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించినట్లు లోకేశ్ అసెంబ్లీ వేదికగా వివరాలను ప్రకటించారు.

### చర్చకు నేను సిద్ధం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కానీ, వైఎస్ జగన్ కానీ ప్రెస్మీట్లు ఎందుకు.? వైఎస్ జగన్ సభకు ఎందుకు రాలేదు. తేదీ, సమయం ఖరారు చేయండి. చర్చకు వచ్చేందుకు నేను సిద్ధం. ఎక్కడైనా,ఎప్పుడైనా చర్చకు సిద్ధం. నేనేమీ పారిపోవడం లేదు. మీలాగా నాపై సీబీఐ కేసులు లేవు. బెయిల్‌పై లేను అని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్, 11 మంది సభ్యులు అసెంబ్లీకి వచ్చి సభలో డీఎస్సీపై ఏవైనా సందేహాలు ఉంటే చర్చించాలని అందుకు తాను సిద్ధం అని మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరారు.

### వైసీపీ టీచర్లను మద్యం దుకాణాల వద్ద పెట్టింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసిందని మంత్రి లోకేశ్ వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నట్లు మంత్రి తెలియజేశారు. తమ ప్రభుత్వం ఇప్పటివరకు విద్యాశాఖలో భారీ ఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని పేర్కొన్నారు. పారదర్శకంగా నియామకాలు చేపట్టాం కాబట్టే ఉపాధ్యాయులు అంతా కలిసి తమ ప్రభుత్వానికి మద్దతుగా ఆందోళనలు చేస్తున్నారని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత ప్రభుత్వం వారిని మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిందని తీవ్ర ఆందోళన చేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉందని, వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చని మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా విడుదల

60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు, 32 లక్షల మంది మ్యాపింగ్ కాని ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను, అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు వివరాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 16వ తేదీ వరకు నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు గడువు ఉన్నట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్లు చెప్పారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో తమ పేరు లేకపోతే సంబంధిత వ్యక్తులు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచించారు. అలాగే తమ ఓటును తొలగించే అవకాశం ఉందని భావించిన వారు అభ్యంతరాలను సమర్పించుకోవచ్చు. ఓటర్లకు నోటీసు ఎందుకు జారీ చేశారనే కారణాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తామని అధికారులు వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన నేపథ్యంలో ఆగస్టు 17వ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్ 19వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పనిచేయనున్నట్లు సీఈఓ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా విడుదలైన నేపథ్యంలో ప్రతి ఓటరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని అధికారులు పేర్కొంటున్నారు. నోటీసు అందిన వారు గడువు ముగిసేలోపు సంబంధిత పత్రాలతో స్పందించాలని పేర్కొన్నారు. తమ పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే, లేదా ఓటు తొలగింపుపై అభ్యంతరం ఉంటే నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

తాజాగా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 22ఏ నిషేధిత జాబితాలో లక్షలాది ఆస్తులను చేర్చారని ఆరోపించిన హరీష్ రావు, రిజిస్ట్రేషన్ కోసం ఫీజులు తీసుకున్న తర్వాత భూమి నిషేధిత జాబితాలో ఉందని చెప్పడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉందని అందుకే జాబితా నుంచి తొలగించేందుకు హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం పరిస్థితే ఇలా ఉంటే రాష్ట్రంలో ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని హరీశ్‌రావు ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను ఎందుకు చేర్చారో సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు 22ఏ జాబితాలో ఎన్ని ఆస్తులు ఉన్నాయి, వాటిని ఎందుకు నిషేధిత జాబితాలో చేర్చారు అందుకు బాధ్యులు ఎవరు అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని అడిగారు. అలాగే నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎప్పటిలోగా తొలగిస్తారో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించాలని నిలదీశారు. ఈ క్రమంలోనే రెవెన్యూ శాఖపైనా హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 22ఏ నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు రెవెన్యూ శాఖలో పనులు పూర్తి చేయించుకునేందుకు 30 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని హరీష్ రావు ఆరోపణలు చేశారు. 30 శాతం కమీషన్ లేకుండా ఒక్క ఫైల్ కూడా ముందుకు కదలడం లేదని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా అంశం ప్రజలను ఇబ్బంది పెట్టే సాధనంగా మారిందని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడానికి ఆదేశాలు ఎవరు ఇచ్చారు, దానికి కారకులు ఎవరు అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## రాహుల్ గాంధీకి

# సుప్రీంలో రిలీఫ్

పిటిషన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, ఇది కక్షపూరితంగా చేపట్టిన చర్య పిటిషనర్ పదేపదే ఇలాంటి ప్రయత్నాలు చేయడం అత్యంత దురదృష్టకరం సీబీఐ కేవలం ఫిర్యాదును సరిచూసుకోవడం తప్ప మరేమీ చేయలేదు" అని ధర్మాసనానికి కపిల్ సిబల్ తెలిపారు. సీబీఐ, ఈడీల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ "ఇప్పటి వరకు ఈ కేసులో మా ప్రమేయం ఏమీ లేదు. కానీ, ఫిర్యాదులోని అంశాలు తీవ్రమైన నేరాలకు ఆస్కారం ఇస్తుంటే అది చాలా తీవ్రమైన విషయమే అవుతుంది"అని వాదించారు.
ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "ఆ విషయంతో మాకు సంబంధం లేదు, ఎవరైనా హత్య వంటి నేరానికి పాల్పడితే దర్యాప్తులో పోలీసులకు ఎవరి అనుమతి అవసరం లేదు. కానీ ఒకవేళ కోర్టు ఏదైనా ఆదేశాలు ఇవ్వాలనుకుంటే, అది సహజ న్యాయసూత్రాలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఆరోపణలు అంత తీవ్రమైనవైతే, ఇప్పటి వరకు ఎందుకు మౌనంగా ఉన్నారని, చర్యలు తీసుకోవడానికి కోర్టు ఆదేశాలు ఇవ్వాల్సిందేనా? జస్టిస్ జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ నిలదీశారు. వర్చువల్‌గా విచారణకు హాజరైన పిటిషనర్ విగ్నేష్ శిశిర్ రాహుల్ గాంధీ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఎఫ్ఐఆర్ నమోదుకు పూర్వ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వాదనలు వినిపించే హక్కు ఉండదని పేర్కొన్నారు. దీనికి సిబల్ జోక్యం చేసుకుంటూ వాస్తవాలు ఒప్పు లేదా తప్పుకావచ్చు.. కానీ ఈ రకంగా కోర్టు అధికార పరిధిని ఉపయోగించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఈ దశలో, ఆరోపణలు అంత తీవ్రమైనవైతే ఇప్పటివరకు మీరేం చేస్తున్నారని అదనపు సొలిసిటరీ జనరల్‌ను కోర్టు ప్రశ్నించింది. "ఇది అంత తీవ్రమైనదైతే, మీ ఏజెన్సీ ఎందుకు మౌనం వహించింది? మీకు కోర్టు ఆదేశం అవసరమా, రాజు గారూ? మీరు సుమోటోగా ఏమైనా చర్య తీసుకున్నారా? లేదు కదూ?' అని జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు. సీబీఐ స్పందన పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం రాహుల్ గాంధీపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల దర్యాప్తులో పురోగతిని వివరిస్తూ కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ జులై 20న సీబీఐను ఆదేశించింది. అంతేకాకుండా విచారణలో ఏవైనా అక్రమాలు తేలితే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడానికి ఈడీకి స్వేచ్ఛ ఉందనడంతో, రాహుల్ గాంధీ ఈ ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## ఝార్ఖండ్‌లోనూ విద్యార్థులదే పైచేయి..

# దిగొచ్చిన ప్రభుత్వం

ప్రభుత్వం దిగివచ్చింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో అభిజీత్ దీప్కే నేతృత్వంలో సీజేపీ నిర్వహించిన జెన్ జీ ఉద్యమం సఫలం అయిన నేపథ్యంలో, ఝార్ఖండ్ విద్యార్థుల ఉద్యమంపై జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది, సోమవారం సీఎం హేమంత్ సోరెన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్నోకు చెందిన 'టీడీపీఎల్' అనే ప్రైవేట్ సంస్థ నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "టీడీపీఎల్ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలని నిర్ణయించాం. ఆ సంస్థ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థుల జాబితాలు సహా అన్నీ రద్దవుతాయి" అని సోరెన్ మీడియాకు వివరించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలో ఒక ప్రత్యేక పరీక్షల సంస్కరణల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కమిటీ 2014 నుంచి జరిగిన నియామక పరీక్షల్లోని లోపాలు, అవకతవకలపై దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో గత 24 రోజులుగా నిరసనలు చేస్తున్న విద్యార్థులు, అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు. రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియంలో ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, విచారణ పారదర్శకంగా జరగాలని, తమ ప్రధాన డిమాండ్ అయిన సీబీఐ విచారణపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

## అది అధికారుల తప్పిదమే,

# బాధితులకు క్షమాపణలు

వెల్లడించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రైవేట్ భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ 757 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిలో మేడ్చల్ నుంచి 511, రంగారెడ్డి నుంచి 144, హైదరాబాద్ నుంచి 49, సంగారెడ్డి నుంచి 38 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. అధికారుల తప్పిదంతోనే సమస్య ఎదురైనట్లు వెల్లడించారు. 22ఏ జాబితాలోకి కొన్ని ప్రైవేటు భూములు ఎలా వచ్చాయనే అంశంపై సబ్ రిజిస్ట్రార్ స్థాయి నుంచి ఐజీ స్థాయి వరకు అధికారులు అలాగే రెవెన్యూ అధికారులు, కలెక్టర్లతో చర్చించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గతంలో కొన్ని భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) జాబితాలో ఉండగా ఆ తర్వాత వాటికి సంబంధించిన కోర్టు ఆదేశాలు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో అధికారులు సక్రమంగా అప్‌లోడ్ చేయకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రత్యేకంగా మేడ్చల్ జిల్లాకు వచ్చిన 511 దరఖాస్తుల్లో సుమారు 320 దరఖాస్తులు యూఎల్‌సీకి సంబంధించినవేనని మంత్రి తెలిపారు. గతంలో ఉన్న కేసుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం వల్ల కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేరినట్లు అధికారులు గుర్తించారని చెప్పారు. ఈ సందర్భంగా ఈ 22ఏ నిషేధిత జాబితాతో ప్రైవేట్ భూముల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం వాస్తవమేనని పేర్కొన్న పొంగులేటి, బాధితులకు ప్రభుత్వం తరఫున క్షమాపణలు తెలిపారు. న్యాయబద్ధమైన ప్రైవేటు భూములకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అర్హత ఉన్న కేసులను పరిశీలించి వాటిని 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. కమిటీ ప్రతి వారం కేసులను పరిశీలించి ఒక్కో దరఖాస్తును కేసు వారీగా పరిశీలించి పరిష్కరించనుంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని న్యాయబద్ధమైన ఆస్తుల విషయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇక 22ఏ జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. 1800 599 4788 నంబర్‌కు ఫోన్ చేసి బాధితులు తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు. 22ఏ పేరు చెప్పి ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను మంత్రి హెచ్చరించారు. ప్రైవేటు ఆస్తులను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వ విధానం కాదని మరోసారి స్పష్టం చేసిన పొంగులేటి న్యాయబద్ధమైన భూములకు రిజిస్ట్రేషన్ సహా ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న

# ఎర్రకోట రాజీవ్ రెడ్డి




**నందవరం** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు.

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చాంద్ భాషా గురజాల గ్రామస్తులు రాజారెడ్డి, పెద్ద నరసింహులు, హనుమంతు యువసేన సభ్యులు ఎం వీరేష్ మహేష్ నాగేంద్ర,రాముడు, రామకేసు, సురేష్, ని.బీముడు, బీముడు,శంకరన్న, టీ. రాముడు, కురువ రాముడు, న తదితరులు..నందవరం గ్రామపంచాయతీ నాయకులు చుక్క మల్లేష్, నిఖిల్ చక్రవర్తి, లింగమూర్తి, బసవరాజు గౌడ్, లక్ష్మన్న, వెంకటేష్, వేణు; గంగవరం నుండి శివన్న, రాముడు మోహన్ రెడ్డి, దానం నందవరం మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్లో బీఆర్ఎస్ ఆందోళన

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆందోళన చేపట్టారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు, పథకాల లబ్ధిదారులతో కలిసి భారీగా బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న ఈ పథకాలను నిలిపివేయడం వల్ల లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలను పునరుద్ధరించాలని కోరారు.

# ఐదేళ్లుగా డ్రైనేజీ, సీసీ రోడ్ల కోసం పోరాటం

## సమస్యలు పరిష్కరించకపోతే పన్నుల సహాయ నిరాకరణ ఉద్యమం చేపడతాం: సాయిరాం కాలనీ వాసుల





కీసర( ప్రశ్న న్యూస్) మౌలిక వసతులైన డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ సాయిరాం కాలనీ వాసులు గత ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీలో డ్రైనేజీ నీరు నిలిచిపోయి, చివరకు మున్సిపల్ తాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న సంపుల్లోకి చేరుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. దీంతో కలుషిత నీటిని తాగే పరిస్థితి ఏర్పడి, అనేక అనారోగ్య సమస్యలకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు దోమల బెడదతో పాటు పందుల, పాముల సంచారం కూడా పెరిగిందని వాపోయారు.ఈ సమస్యల పరిష్కారం కోసం అప్పటి స్థానిక కౌన్సిలర్ నుంచి మంత్రి సీతక్క వరకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతులు అందజేశామని తెలిపారు. ఎన్నోసార్లు ప్రజావాణిలో తమ గోడును విన్నవించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. ఈ క్రమంలో నలుగురు మున్సిపల్ కమిషనర్లు మారినా తమ సమస్యలు మాత్రం మారలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.విసిగి వేసారిన కాలనీ సభ్యులు సోమవారం ఎంఎంసీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. సమస్యను స్వయంగా పరిశీలించేందుకు త్వరలో ఫీల్డ్ విజిట్ నిర్వహించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు కాలనీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ సభ్యులు కమలాకర్ అత్తే, నాగరాజు, కిశోర్, బాలకృష్ణ, రియాజ్, మాట్లాడుతూ.. తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ యంత్రాంగంపై పన్నుల సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ముప్ప రామారావు బాసటగా నిలిచారని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# డప్పు కళాకారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు టీఎంఆర్పీఎస్ వినతి



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్): డప్పు వాయిస్తూ సంప్రదాయ కళను కొనసాగిస్తున్న మాదిగ కళాకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ మంజూరు చేయాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎంఆర్పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టీఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు.డప్పు కళాకారులకు నెలవారీ పెన్షన్‌తో పాటు మాదిగ దండోరా ఉద్యమకారులకు 200 గజాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హులైన దళితులకు 'అంబేద్కర్ అభయహస్తం' పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందిస్తూ, మాదిగల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు జీడి శ్రీనివాస మాదిగ, జిల్లా అధ్యక్షుడు మచ్చ పృథ్వీరాజ్ మాదిగ, టీఎంవైఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మెర అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# టాయిలెట్లు లేకుంటే ప్రజా ఉద్యమమే

## – సీపీఐ నేతలు మద్దిలేటి నాయుడు దాసరి గణేష్ వార్నింగ్



గోనెగండ్ల గ్రామ బస్టాండ్ ఆవరణలో గత 50 ఏళ్లుగా కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు (టాయిలెట్స్) లేకపోవడంతో మహిళలు, గర్భిణీలు, విద్యార్థినులు, వృద్ధులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారని సిపిఐ జిల్లా నాయకులు మద్దిలేటి నాయుడు, ఏఐటీయూసీ తాలూకా డిప్యూటీ సెక్రటరీ దాసరి గణేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.?ఈ సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించగా, ఆదివారం గోనెగండ్ల బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ డీఎం (ఆఓ) గారిని సిపిఐ జిల్లా నాయకులు మద్దిలేటి నాయుడు, ఏఐటీయూసీ నాయకులు కలిసి నేరుగా మాట్లాడారు. బస్టాండ్‌లోని సుమారు 100 దుకాణాల పేద వ్యాపారులు, నిత్యం ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను డీఎం దృష్టికి తీసుకెళ్లారు.?ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం స్పందిస్తూ.. బస్టాండ్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల టాయిలెట్ల నిర్మాణానికి కొంత ఇబ్బంది అవుతోందని, మంగళవారం నాడు గ్రామ పంచాయతీ సెక్రటరీతో మాట్లాడి తాగునీటితో పాటు టాయిలెట్ల సదుపాయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.?అనంతరం సిపిఐ జిల్లా నాయకులు మద్దిలేటి నాయుడు మాట్లాడుతూ.. శాఖల మధ్య ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ కాలయాపన చేయడం సరికాదని, మహిళల ఆత్మగౌరవాన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'స్వచ్ఛ భారత్' లేదా పంచాయతీ నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన విద్యాసంస్థల్లో పార్ట్ టైట్ ఉద్యోగులకు

# దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్** నల్గొండ, సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్ టైమ్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రాయి ప్రకటనలో తెలిపారు.నల్గొండ జిల్లాలో డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ విభాగాల్లో మొత్తం 19 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 22 సాయంత్రం 5 గంటల వరకు నల్గొండలోని మహిళా సమాఖ్య భవన్లో ఉన్న ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలుర గురుకుల పాఠశాల, అవంతిపురంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ విభాగాల్లో మొత్తం 27 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ లెక్చరర్లు 2 పోస్టులు, జూనియర్ లెక్చరర్లు 11 పోస్టులు, పీజీటీ 5 పోస్టులు, టీజీటీ 7 పోస్టులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.పీజీటీ, టీజీటీ అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం, బీఈడీలో 50 శాతం, టెట్ పార్ట్ 2లో అర్హత ఉండాలని పేర్కొన్నారు.జేఎల్ అభ్యర్థులకు పీజీ లేదా డిగ్రీలో 55 శాతం మార్కులతో పాటు బీఈడీలో 55 శాతం, టెట్ 2లో అర్హత ఉండాలని తెలిపారు. డిగ్రీ లెక్చరర్లకు పీజీ లేదా డిగ్రీలో 55 శాతం, పీహెచ్డీ లేదా నెట్ లేదా సెట్ అర్హత ఉండాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో 1:5 నిష్పత్తిలో ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, సమాచారం కోసం 83339 25379 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు

# బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నిర్మల్ కుమార్



**రాయచోటి** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నియమించారు.జిల్లా కార్యదర్శిగా తనను నియమించినందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, అన్నమయ్య జిల్లా పార్టీ నాయకత్వానికి నిర్మల్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యత లభించేందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని నిర్మల్ కుమార్ తెలిపారు.అలాగే నూతనంగా ఎన్నికైన అన్నమయ్య జిల్లా బీజేపీ కమిటీ సభ్యులందరికీ రాయచోటి బీజేపీ నాయకుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

## – వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?

## – గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు

## – పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు

**బద్వేలు** ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది. ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి. నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది. ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి. 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి. అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది. ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది. మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది. పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది. ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది. విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు.

## తుంగభద్ర నది ఎండిపోవడంపై కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి

### – తుంగభద్ర జలాల కోసం రైతుల ఆవేదన



**నందవరం** మండల పరిధిలోని గురజాల గ్రామంలో తుంగభద్ర నదిలో నీరు పూర్తిగా ఎండిపోయి, తాగు,సాగునీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.నదిలో కనీసం ప్రవహించే నీరు కూడా కనిపించకుండా పోయిందని పాడి పశువులకు సైతం నది తీరంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామస్తులు, రాజీవ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోయి కనీసం ప్రవాహపు జాడ కూడా లేకపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని రాజీవ్ రెడ్డి విమర్శించారు.తుంగభద్ర నది తీర ప్రాంత రైతులు తమ ప్రధాన సమస్యను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. తుంగభద్ర నది నుంచి నీరు వస్తుందనే నమ్మకంతో పంటలు సాగు చేశామని, వరి నాట్లు పూర్తయిన తర్వాత నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నప్పటికీ దిగువ ప్రాంతమైన రాయలసీమకు,నది తీర ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు.తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తుంగభద్ర జలాలను రాయలసీమ రైతులకు అందించాలని కోరారు. సాగునీరు అందక ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతన్నలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.ఇసుక రీచ్‌ల పేరుతో దోపిడీ నదిలో చుక్క నీరు లేక ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, మరోవైపు ఇసుక రీచ్‌ల పేరుతో నదిని మరింతగా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# చేనులకు హంద్రీనీవా నీళ్ల నిలిపివేత

## – తీవ్ర ఆగ్రహంలో రైతన్నలు

## – అధికారుల తీరుపై మండిపడుతున్న అన్నదాతలు

## – పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన





**పత్తికొండ** పత్తికొండ మండలం హోసూరు గ్రామం లో పంట పొలాలకు జీవనాధారమైన హంద్రీనీవా కాలువల నుంచి చేనులకు నీటిని కట్టకుండా అధికారులు ఆంక్షలు విధించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాలకు నీరు పారించుకోవడానికి వెళ్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని, దీనివల్ల కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండిపోతున్నా పట్టవా??రాత్రింబవళ్లు కష్టపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామని, ఇప్పుడు కీలక సమయంలో నీళ్లు ఇవ్వకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తమ కళ్లముందే చేన్లు ఎండిపోతుంటే అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ?అధికారుల వైఖరిపై విమర్శలు ?నీటి వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించడం, కాలువల వద్ద కాపలా ఉండి నీటిని మళ్లించకుండా అడ్డుకోవడంపై స్థానిక హోసూర్ రైతు, బనగాని శ్రీనివాసులు, మండిపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. 'సాగునీరు అందక పంట ఎండిపోతే మేము అప్పుల పాలవుతాం. అధికారులు వెంటనే స్పందించి చేనులకు నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతాం."బాధిత రైతులు రైతుల ప్రధాన డిమాండ్లు: హంద్రీనీవా కాలువల నుంచి పంట పొలాలకు నీటిని తక్షణమే విడుదల చేయాలి.చేనులకు నీళ్లు కట్టకుండా అడ్డుకుంటున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.?చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి. వెంటనే అధికారులు స్పందించి తమ పంటలను కాపాడాలని, హోసూర్ గ్రామ రైతులు తదితరులు కోరుతున్నారు

## గిరిజన పీహెచ్‌సీని సందర్శించిన

# ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి



**కొత్తపల్లి** : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పి.వి.ఎస్. నాయుడు ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి బి. పరమేశ్వర్ కొత్తపల్లి, గోకవరం గిరిజన పీహెచ్‌సీతో పాటు యెర్రమటం చెంచు గూడెం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ పనితీరు, ఓపీ సేవలు, తల్లి?బిడ్డ ఆరోగ్యం, గర్భిణీలకు అందుతున్న సేవలు, టీకాలు, జ్వరాలు, అంటువ్యాధులు, ప్రయోగశాల పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మందుల లభ్యత తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు.చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలుకొత్తపల్లి, శివపురం, యెర్రమటం చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. యెర్రమటం చెంచు గూడెంలో జరిగిన వైద్య శిబిరానికి 55 మంది, కొత్తపల్లి గూడెంలో 60 మంది హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తపోటు, మధుమేహం, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి పూర్తి రక్త పరీక్షలు, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, పరిశుభ్రత, పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ద్వీపా నాగవేణి, గులాబ్జా, డాక్టర్ హకీమ్ రషీద్, డాక్టర్ సుష్మా సాయి, ప్రజారోగ్య విస్తరణ వైద్యాధికారి రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఏఎన్ఎంలు నిర్మల జయమణి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, మెయిల్ హెల్త్ అసిస్టెంట్ శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.డాక్టర్ హకీమ్ రషీద్ మాట్లాడుతూ యెర్రమటం, జనాల గూడెం ప్రాంతాల్లోని గర్భిణీలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు, చికిత్స, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి శ్రీ బి. పరమేశ్వర్ వైద్య సిబ్బంది సేవలను అభినందించారు. గిరిజన పీహెచ్‌సీలో ప్రైవేట్ ఆసుపత్రులకు సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, తదుపరి చికిత్సపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

## 85% సబ్సిడీతో గొర్రెలకు,

# మేకలకు పశు భీమా

### -పి.భాస్కర్ (పశువైద్యాధికారి)



**పాములపాడు** 2026 -27 సంవత్సరానికి సంబంధించి పాములపాడు మండలానికి 220 జీవాలకు భీమా లక్ష్యం నిర్దేశించడమైనదని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మీడియా సమావేశంలో తెలిపారు.పాములపాడు మండలంలోని, గొర్రెల, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ కోరారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ వివరాలకు సమీపంలోని, రైతు సేవా కేంద్రంలోని అనీమల్ హస్బెం డ్రి అసిస్టెంట్ , స్థానిక పశువైద్యాధికారిని సమర్పించాలన్నారు.పెంపకం దారులు 6 నెలలు దాటిన గొర్రెలకు, మేకలకు భీమా చేయించాలన్నారు.1 సంవత్సరము రూ"లు 6,000/- భీమా వర్తించుట కొరకు చెల్లించవలసిన ప్రీమియం 180 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ 153 పోను లబ్ధిదారుడు కేవలం 27 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందనీ అన్నారు.ప్రతి గొర్రె, మేక కి తప్పని సరిగా చెవి పోగు / ట్యాగ్ వేయించాలన్నారు.ఎప్పుడైనా చెవి పోగు / ట్యాగ్ పడిపోతే వెంటనే పశువైద్య సిబ్బంది చేత కొత్త ట్యాగ్ వేయించాలనీ అన్నారు.ట్యాగ్ లేనిచో భీమా వర్తించదనీ అన్నారు.ఈ కార్యక్రమంలోసిబ్బంది తిరుమలేష్, కవిత, పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

## పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ డిమాండ్





మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని కోరుతూ పర్యావరణ ప్రేమికులు కోళ్ల రవీంద్ర ముదిరాజ్ ప్రజావాణిలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.,నగరంలో నాణ్యతలేని సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఇస్తరాకులు, ఫంక్షన్ హాల్స్, రైతు బజార్, వారాంతపు అంగట్లో, హోటల్స్, దేవస్థానాల వద్ద, క్యాటరింగ్ సెంటర్లు, విచ్చలవిడిగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడుతున్నారని ఆరోపించారు., ఫంక్షనల్ యజమానులు, వేలాది రూపాయల అద్దె తీసుకొని స్టీల్ ప్లేట్లు ఇవ్వకుండా ప్లాస్టిక్ ఇస్తరాకుల్లో భోజనాలు వడ్డిస్తున్నారని విమర్శించారు. తినుబండారాల టిఫిన్ సెంటర్లు పర్యావరణాన్ని దెబ్బతీస్తూ యున్నారు.దీనికి స్పందించిన కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులకు ఉత్తర్వులు ఇస్తూ ఫంక్షన్ హాల్ యజమానులను హోటల్ యజమానులను దేవస్థాన అధ్యక్ష కార్యదర్శులను పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల గోమాత జలమాత మానవుల ఆరోగ్యాలు కలుషితమవుతున్నాయని ,వర్షం పడ్డప్పుడు డ్రైనేజీలలో ప్లాస్టిక్ నిండిపోయి కాలనీలు మునిగిపోతున్నాయి, ఇటీవల హైడ్రా,డ్రైనేజీలు క్లీన్ చేస్తుంటే టన్నులకొద్దీ ప్లాస్టిక్ కవర్లు బాటిల్స్,ఇస్తరాకులు, బయటపడ్డాయని ,వెంటనే స్పందించినందుకు కమిషనర్ కు ధన్యవాదాలు తెలిపారు.

# మయూర కంపెనీ మొండి వైఖరి కి నిరసనగా సమ్మె బాట పట్టిన కార్మికులు




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మయూర కంపెనీ మొండి వైఖరి కి నిరసనగా కార్మికులు సమ్మె బాట పట్టారు.మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈనెల 17 నుండి కార్మికులు సమ్మె బాట పట్టారు.గత మూడు సంవత్సరాలుగా మయోరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు వేతన ఒప్పందం కొరకు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద చర్చలు కొనసాగుతున్నాయి కానీ యాజమాన్యం మొండి వైఖరితో కార్మికులను వేధింపులకు గురి చేయడం సస్పెండ్ డిస్మిస్లు చేయడం కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం న్యాయమైన డిమాండ్లు వేతన ఒప్పందం పై చర్చలు జరపకుండా యాజమాన్యం కాలయాపన చేస్తూ కార్మికుల తీవ్ర ఇబ్బందులకు మనోవేదనకు గురి చేయడానికి నిరసిస్తూ సమ్మెకు దిగారు. వయోరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికుల పెండింగ్ సమస్యలపై కొనసాగుతున్న సమన్వయ ప్రక్రియను ఇకపై పెండింగ్ లో ఉంచకుండా తగిన విధంగా పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జరిగిన చర్చలు సమావేశాలు యాజమాన్యానికి ఇచ్చిన అవకాశాలను పరిగణలోకి తీసుకొని సమస్యలు పరిష్కారం కానందున తదుపరి చట్టపరమైన చర్యలకు యూనియన్కు అవకాశం కల్పించాల్సిందిగా కోరారు. కార్మికుల న్యాయబద్ధమైన హక్కులు ప్రయోజనాల పరిరక్షించబడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ సమ్మె ఆగదని కార్మికులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ సంతోష్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన బీఆర్ఎస్ నేతలు..

# ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

**కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను ఎత్తేసే ఆలోచన లో ప్రభుత్వం ఉందని ఆరోపిస్తూ ఆందోళన**

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను యధావిధిగా ఇవ్వాలని డిమాండ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ నేతలు మేడ్చల్ లో కదం తొక్కారు. రెవెన్యూ కార్యాలయ ప్రధాన ద్వారం నుండి మేడ్చల్ తహసిల్దార్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ గా వచ్చి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం బయట బి ఆర్ ఎస్ నేతలు బైఠాయించి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆడబిడ్డలకు అన్నను అయితే అంటూ బూటకపు మా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఆడబిడ్డలకు చేయూతనిచ్చే కళ్యాణి లక్ష్మి, షాది ముబారక్ పథకాలనుతుంగలో తొక్కేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మేడ్చల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఆరోపించారు. ఆడబిడ్డలకు చేయూతనివ్వడం పక్కన పెడితే వారికి ఉపయోగపడే పథకాలను సైతం ఎత్తివేసే ప్రయత్నంలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని భాస్కర్ యాదవ్ విమర్శించారు. ప్రజల ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న రేవంత్ ప్రభుత్వం త్వరలో కుప్పకూలిపోవడం ఖాయమని, బిఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం లాంచనమేనని, ఇప్పటికే రేవంత్ ప్రభుత్వం పై ప్రజలలో వ్యతిరేకత వచ్చిందని భాస్కర్ యాదవ్ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలను మరింత పటిష్టం చేస్తామన్నారు. ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ఆడబిడ్డల సంక్షేమం కోసం కెసిఆర్ ప్రభుత్వ ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఇవ్వకపోవడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం ఒక అన్నగా కృషి చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రవేశపెట్టిన షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి కన్నెర చేయడం బాధాకరమని, పేద మధ్య తరగతి వారికి షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు ఎంతో ఉపయోగపడతాయని వాటిని యధావిధిగా కొనసాగించాలని, సకాలంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, రాజమల్లారెడ్డి ఏ, నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్, సురేష్ రెడ్డి జగన్ రెడ్డి, రణధీర్ రెడ్డి కౌన్సిలర్లు నిషితా రెడ్డి, రజిత, మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, పెంటయ్య, తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ఆదివాసి విద్యార్థులకు సహాయం చేయండి

## బితుడుం దెబ్బ స్టడీ సెంటర్ కు పుస్తకాలు, కంప్యూటర్లు, ఫర్నిచర్ కావాలి




ములుగు(ప్రశ్న న్యూస్) ఏటూరు నాగారం ఆదివాసి, గిరిజన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎటూరునాగారంలోని తుడుం దెబ్బ జిల్లా కార్యాలయంలో నడుస్తున్న తుడం దెబ్బ స్టడీ సెంటర్ కు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి కోరింది.సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లె బాలకృష్ణ గురువారం ఐటిడిఏ పీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ సెంటర్ లో వందలాది మంది విద్యార్థులు ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు.కానీ సెంటర్ వద్ద ఎంట్రెన్స్ ఎగ్జామ్ పుస్తకాలు, 2 కంప్యూటర్లు, కూర్చోవడానికి సరైన ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే పుస్తకాలు, కంప్యూటర్లు, ఫర్నిచర్ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో స్పందించి సహాయం అందిస్తే పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

## కీసర తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా



కీసర (ప్రశ్న న్యూస్ ) పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కీసర తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు కీసర గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఎంతో ఆర్థిక సహాయం అందిందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పథకాల ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి, కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు శీలం శ్రీనివాస్, రాగుల రమేష్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు గోరంటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సుమన్ బన్నీ, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, యువత అధ్యక్షుడు రెడ్డబోయిన మహేష్, హరి గౌడ్, రాజలింగం, ఎర్ర సాయిలు తదితరులు పాల్గొన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# కుందన్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో శివాలయ నిర్మాణ పూజ

**ఆలయ స్లాబ్ నిర్మాణానికి 150 బ్యాగుల విరాళం ఇచ్చిన దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప రామారావు**



కీసర ( ప్రశ్న న్యూస్) కుందన్‌పల్లి రామలింగేశ్వర కాలనీ 4వ డివిజన్‌లో శివాలయ నిర్మాణ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప రామారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప రామారావు, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌తో కలిసి కాలనీ వాసులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ స్లాబ్ నిర్మాణానికి అవసరమైన 150 బ్యాగుల అల్ట్రాటెక్ సిమెంట్‌ను విరాళంగా అందజేశారు.ఆలయ నిర్మాణానికి సహకరించిన ముప్ప రామారావుకి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# సమయస్ఫూర్తికి నిదర్శనం.. నాగారం వద్ద తప్పిన ఘోర ప్రమాదం




ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ రాంపల్లి సిగ్నల్ వద్ద జీహెచ్ఎంసీ చెత్త తరలించే వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికంగా కలకలం రేగింది. వాహనం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన ట్రాఫిక్ సీఐ శివశంకర్, ఆయన సిబ్బంది వెంటనే అప్రమత్తమై రంగంలోకి దిగారు.మంటలు చెలరేగిన వాహనం వద్దకు పోలీసులు చేరుకుని, ఎలాంటి ఆలస్యం చేయకుండా దానిని రోడ్డు పక్కకు తరలించారు. అనంతరం స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.పోలీసులు సకాలంలో స్పందించకపోతే సమీపంలోని వాహనాలకు మంటలు వ్యాపించి భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదాన్ని నివారించిన సీఐ శివశంకర్‌తో పాటు పోలీసు సిబ్బందిని స్థానికులు, వాహనదారులు అభినందించారు.

# దేశాన్ని నిలబెట్టే త్రిమూర్తులు.

ఒక చెట్టు నిలబడాలంటే వేరు బలంగా ఉండాలి
దేశం నిలబడాలంటే ముగ్గురు మహనీయులు బలంగా ఉండాలి వారే..
రైతు..సైనికుడు.. ఉపాధ్యాయుడు.

భూమాత ఒడిలో పుట్టిన ప్రతి గింజకు ప్రాణం పోసేది రైతు..!
భారతమాత సరిహద్దులపై ప్రాణాలను ఫణంగా పెట్టేది సైనికుడు..!
భావి భారతాన్ని అక్షరాలతో శిల్పంగా మలిచేది ఉపాధ్యాయుడు..!

ఈ ముగ్గురు వ్యక్తులు కాదు.. ఈ దేశాన్ని నిలబెట్టే మూడు శక్తులు..

ఈ జాతికి జవజీవాల్ని రక్షణను అందిస్తూ
ముందుకు నడిపించే మూడు చోదశ శక్తులు..
భరతమాత దివ్య కిరీటం పై మెరిసే మణి రత్నాలు

భూమిని తల్లిగా భావించి మట్టిని నుదుటి తిలకంగా ధరించి చెమటను గంగాజలంగా చిందిస్తూ,
ఆకలితో ఉన్న ప్రపంచానికి అన్నపూర్ణగా మారేది రైతు.

తన కడుపు మాడుతున్న మన కడుపు నిండా అన్నం పెడతాడు తన కష్టాన్ని ఎప్పుడూ లెక్కపెట్టడు..
మన జీవితాలను మాత్రం సస్యశ్యామలం చేస్తాడు.

రైతు నాగలి ఆగిన రోజు.. చరిత్రలోనే అతిపెద్ద కరువు ప్రారంభమవుతుంది.
మెతుకుల విలువ తెలిసినప్పుడే రైతు గొప్పతనం అర్థమవుతుంది.

పదవీ విరమణ లేని మహోన్నత సేవకుడు రైతు..!
ఎందుకంటే..
ఆయన శ్వాస,ధ్యాస వ్యవసాయం..
ఆయన జీవితం దేశ ప్రజల ఆకలి తీర్చడం.

మండుటెండైన..
మంచు కొండల మధ్యన ఎముకలు కొరికే చలైన.. కుండపోత వర్షమైన..

తుఫాన్లు,తుపాకి గుండ్లు ఎదురైనా..
నా దేశం సురక్షితంగా ఉండాలి.
అనే ఒక్క సంకల్పంతో సరిహద్దుల్లో కాపలా కాస్తూ నిలబడేది సైనికుడు.
మనం నిశ్చింతంగా నిద్రపోయే ప్రతి రాత్రి వె నుక ఒక సైనికుడి నిద్రలేని కళ్ళు ఉంటాయి.
మనం స్వేచ్ఛగా శ్వాసించే ప్రతిక్షణం వెనుక ఒక వీరుని రక్తంతో రాసిన చరిత్ర ఉంది.
మన జాతీయ జెండా రెపరెపల వెనుక ఎందరో వీరుల రక్తపు చుక్కలు ఉంటాయి.
సైనికుడు ఒక్క క్షణం అప్రమత్తత కోల్పోతే..
దేశం భద్రత ప్రమాదంలో పడుతుంది.

అందుకే..సైనికుడి త్యాగం ప్రతి భారతీయుడి మది లో నిలవాలి.
అక్షరాన్ని అందించి అజ్ఞాని పారద్రోలే జ్ఞాన సూర్యుడు ఉపాధ్యాయుడు.
ఆయన చేతిలో సుదర్శన చక్రం లేదు.
కానీ అజ్ఞానాన్ని చేదించే జ్ఞాన చక్రం ఉంది.
ఆయన చేతిలో రాజదండం లేదు.
కానీ భవిష్యత్తును శాసించే కలం ఉంది.

ఒక వైద్యుడు,ఇంజనీరు, శాస్త్రవేత్త,న్యాయమూర్తి, ఐపీఎస్,ఐఏఎస్,ముఖ్యమంత్రి ప్రధాన మంత్రి వెనుక ఉండేది ఒక ఉపాధ్యాయుడు మాత్రమే.
ఆయన సంపాదించేది సంపద కాదు.
శిష్యుల విజయాలు..
ఆయన కోరుకునేది కీర్తి కాదు..విద్యార్థి చిరునవ్వు.
ఆయన జీవితంలో గొప్ప బహుమతి..
సార్ నేను మీ శిష్యుడిని.

అని గర్వంగా పలికే ఒక మాట.
రైతు లేకుంటే ఆకలి రాజ్యమేలుతుంది..
సైనికుడు లేకుంటే శత్రువు రాజ్యమేలుతారు.. ఉపాధ్యాయుడు లేకుంటే అజ్ఞానం రాజ్యమేలుతుంది..

రైతు దేశానికి అన్నం.. సైనికుడు దేశానికి అభయం.. ఉపాధ్యాయుడు దేశానికి జ్ఞానం.
ఒకరు శరీరాన్ని పోషిస్తారు.. ఒకరు దేశాన్ని రక్షిస్తారు..
మరొకరు మనుసును నిర్మిస్తారు.

అందుకే.. రైతు చిందించే ప్రతి చెమట బిందువుకు నమస్కారం..
సైనికుడు ప్రతి రక్తపు చుక్కకు వందనం..
ఉపాధ్యాయుడు అక్షర దీపానికి శతకోటి ప్రణామాలు..
రైతు దేశపు అన్నదాత.. సైనికుడు దేశపు ప్రాణదాత.. ఉపాధ్యాయుడు దేశపు భవితదాత..
ఈ ముగ్గురు ఉన్నంతకాలం భరతమాత తలెత్తి నిలుస్తుంది.. ఈ త్రిమూర్తులే భరతమాతకు మూడు నేత్రాలు..

ఈ త్రిమూర్తులే భారతదేశానికి వెన్నుముకలు..
జై జవాన్..జై కిసాన్.. జై విద్యా గురు.
దేశిని శ్రీధర్ గౌడ్



ఎం.ఏ, ఎం .ఈడి ప్రిన్సిపల్
ఎస్ఆర్ జూనియర్ కళాశాల నయీమ్ నగర్
హనుమకొండ.
9849818284

## అల్లు అరవింద్ కామెంట్స్‌పై

# యశ్ స్పందన



'కేజీఎఫ్' చిత్రంతో దేశ వ్యాప్తంగా అద్భుతమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ రాకింగ్ స్టార్ యశ్... ప్రస్తుతం తన రాబోయే చిత్రం 'టాక్సిక్' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, గతంలో అల్లు అరవింద్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఒక ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా స్పందించారు.

కేజీఎఫ్ చిత్రం తన కెరీర్‌ను మలుపు తిప్పిందనే విషయాన్ని ఒప్పుకుంటూనే, ఒక సినిమా విజయం, దానికి వచ్చే గుర్తింపుపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఒక సినిమా వల్ల నిర్మాత కంటే హీరోకే ఎక్కువ గుర్తింపు వస్తుందనే అంశంపై యశ్ మాట్లాడుతూ... విజయం అనేది కేవలం నిర్మాతకు లేదా ఒక్క వ్యక్తికి మాత్రమే సొంతం కాదని స్పష్టం చేశారు. క్యారెక్టర్ ఆర్టిస్టుల నుంచి రచయితల వరకు అందరి కష్టం తోడైతేనే మంచి అవుట్‌పుట్ వస్తుందని, ప్రధాన పాత్రలో నటించేవారు సరిగ్గా చేయలేకపోతే సినిమా కచ్చితంగా విజయం సాధించదని తెలిపారు. ప్రేక్షకుల నిర్ణయం ఎప్పుడూ తప్పు కాదని, ఎవరి శ్రమకు తగిన గౌరవం వారికి ఇవ్వడంలో ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఎంతటి స్టార్ హీరో తలరాతనైనా శుక్రవారం విడుదలయ్యే ఆ ఒక్క రోజే నిర్ణయిస్తుందని, సినిమా ఆడకపోతే 'పాన్-ఇండియా' ట్యాగ్ కూడా మాయమైపోతుందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, 2023లో ఓ సినిమా వేడుకలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "కేజీఎఫ్ కంటే ముందు యశ్ ఎంతమందికి తెలుసు?" అని ప్రశ్నిస్తూ, భారీ నిర్మాణ విలువలే ఆ సినిమా అంత పెద్ద హిట్ అవ్వడానికి కారణమని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఈ కామెంట్స్ పై యశ్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, తాజాగా యశ్ స్పందిస్తూ.. ఇతరుల వ్యాఖ్యలు లేదా కామెంట్లు తన వ్యక్తిత్వాన్ని ఏమాత్రం మార్చలేవని తేల్చి చెప్పారు.



# అనసూయపై పోలీసులకు ఫిర్యాదు..

### - హిందూ మతంపై వ్యాఖ్యల వివాదం మరింత ముదురుతోందా?

యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. హిందూ మతానికి సంబంధించిన అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఇటీవల సోషల్ మీడియాలో అనసూయ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. 'జై శ్రీరామ్' పేరుతో కొందరు దాడులకు పాల్పడుతున్నారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మతపరమైన అంశాలపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి వ్యాఖ్యలతో ఇతరుల మనోభావాలను దెబ్బతీయవద్దని వారు సూచించారు. అయితే ఈ వివాదంపై అనసూయ వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

తనను విమర్శిస్తున్న వారికి కూడా ఆమె ఘాటైన రీతిలో స్పందించారు. తన వ్యాఖ్యల వల్ల "దొంగలంతా బయటకు వస్తున్నారు" అంటూ కౌంటర్ ఇచ్చినట్లు సమాచారం. అనసూయ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మొదలైన వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్ వరకు చేరడంతో విషయం మరింత ఆసక్తికరంగా మారింది. ఆమె వ్యాఖ్యలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఫిర్యాదుపై విచారణ చేపడతారా? అనసూయను వివరణ కోరుతారా? అనే అంశాలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మరోవైపు, ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలు ఉన్నాయా అనే ఆసక్తి కూడా నెలకొంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అనసూయకు అనుకూలంగా, వ్యతిరేకంగా నెటిజన్లు స్పందిస్తుండటంతో ఈ వ్యవహారం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# హైదరాబాద్ బిర్యానీ లాంటి సినిమా



హైదరాబాద్ నేపథ్య కథాంశంతో రూపొందిన యువతరం సినిమా 'అమీర్ లోగ్'. ఎంసీ హరి, మనోజ్, శశిధర్, వేద జలంధర్ ప్రధానపాత్రధారులు. రమణారెడ్డి సోమ దర్శకుడు. మాధవిరెడ్డి సోమ నిర్మాత. స్పిరిట్ మీడియా సంస్థ ద్వారా రానా దగ్గుబాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 21న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకులు ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'అమీర్ లోగ్' సహజమైన భావాలను ప్రతిబింబించే సినిమా. చూస్తున్నంతసేపూ హైదరాబాద్ బస్తీల్లోకి వెళ్లినట్టుగా, ఆ బస్తీల్లో జీవిస్తున్నట్టుగా అనిపిస్తుంది. మేం బస్తీల్లో పెరిగాం.తెలంగాణ యాస, బస్తీ నేపథ్య కథ అవ్వడంతో ఈ పాత్రలు పోషించడం మాకు సులభమైంది. దర్శకుడు రమణ నేచురల్‌గా, సింపుల్‌గా సినిమా తీశారు' అని చెప్పారు హరి, మనోజ్, శశిధర్. ఇంకా చెబుతూ 'ఇది బిర్యానీ చుట్టూ తిరిగే కథ. ఫస్టాఫంతా బిర్యానీ స్మెల్ వస్తుంది. సెకండాఫ్ బిర్యానీ టేస్ట్ తెలుస్తుంది.క్లైమాక్స్ కడుపు నిండినట్టు ఉంటుంది. తెరపై మేం ముగ్గురం ఎక్కువగా కనిపించినా, మహిళా పాత్రలే ఈ సినిమాలో కీలకం. అమ్మనాన్నలు, అన్నావదినలు, అక్క, పక్కింటి పాత్రలు.. ఇవన్నీ ఈ కథకు ప్రత్యేక ఆకర్షణలు. సినిమా చూశాక మా అందరికీ విజయంపై నమ్మకం కుదిరింది. స్మరణ్ ఈ సినిమాకిచ్చిన మ్యూజిక్, ఆర్ఆర్ నెక్ట్స్ లెవల్. హైదరాబాద్ భాషకీ, యాసకి అడ్రెస్‌లా 'అమీర్‌లోగ్' ఉంటుంది' అని తెలిపారు హరి, మనోజ్, శశిధర్.

# ముంబైలో క్లాసిక్ లవ్‌స్టోరీ?



తెలుగమ్మాయి శ్రీలీల దక్షిణాదిన సినిమాలు తగ్గించింది. దానికి కారణం విజయాలు లేక కాదు. ప్రస్తుతం ఈ ముద్దుగమ్మ కాన్సన్‌ట్రేషన్ అంతా బాలీవుడ్ పైనే. సాధారణంగా బాలీవుడ్ సినిమాలు ఏండ్ల తరబడి నిర్మాణాలు జరుపుకుంటూ ఉంటాయి. అందుకే.. కాల్‌షీట్స్ మధ్య క్లాష్ రాకుండా తాను ఎంతో నమ్మకం పెట్టుకున్న 'ఆషీకీ 3' సినిమాకు వీలైనంత ఎక్కువ కాల్‌షీట్స్ ఇచ్చి, శ్రద్ధంతా ఆ సినిమాపైనే పెట్టింది శ్రీలీల. యూత్‌ని టార్గెట్ చేస్తూ.. విజువల్ వండర్‌గా, అద్భుతమైన మ్యూజిక్‌తో ఓ దృశ్యకావ్యంగా దర్శకుడు అనురాగ్ బసు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. బాలీవుడ్‌లోనూ క్లాసిక్ లవ్‌స్టోరీ వచ్చి చాలా కాలమైంది. ఈ నేపథ్యంలో 'ఆషీకీ 3'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇందులో శ్రీలీల పాత్ర కీలకంగా ఉంటుందట. అందుకే నటన విషయంలోనూ, లుక్స్ విషయంలోనూ ఆమె ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నదట. కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వైభవంగా మొదలైంది. ఈ షెడ్యూల్‌లో కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలతోపాటు, రెండు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. 'బాలీవుడ్ తెరపై సత్తా చాటేందుకు 'ఆషీకీ 3'నే శ్రీలీలకు బలమైన వేదిక' అంటూ ఆమె అభిమానులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# 'ఇరుముడి'లో కొత్త రవితేజను చూస్తారు



'ప్రతి టెక్నీషియన్ ప్రాణం పెట్టి చేసిన సినిమా ఇది. ఈ సినిమా మంచి ఎమోషనల్ రైడ్. ఇందులో కొన్ని పాత్రలు ప్రేక్షకుల మైండ్‌లో ఉండిపోతాయి. మైత్రీలో నా మూడో సినిమా ఇది. ఈ సంస్థ నుంచి నా సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇందులో ఓ డిఫరెంట్ రవితేజను చూస్తారు. మీ అందరికీ తప్పకుండా ఈ సినిమా నచ్చుతుంది' అని అగ్ర కథానాయకుడు రవితేజ నమ్మకం వెలిబుచ్చారు. ఆయన కథానాయకుడిగా నటించిన డివైన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. ప్రియా భవానీశంకర్ కథానాయిక. బేబీ నక్షత్ర కీలక పాత్రధారి. శివ నిర్వాణ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ 'ఇందులో కథానాయకుడి పేరు త్రినాథ్. అతని ప్రపంచం ఓ ఎక్స్‌ట్రార్డినరీ ఎమోషనల్ ఫీల్‌ని ఆడియన్‌కి ఇస్తుంది. కూతురుకి స్వతంత్ర్యం ఇచ్చే తండ్రి కథ ఇది. అందరి ఆడపిల్లల్లో తన కూతురునే చూస్తుంటాడు ఇందులో హీరో. దానికి ఓ కొత్త నేపథ్యాన్ని ఎంచుకున్నా. చాలా టెన్షన్ పెట్టే థ్రిల్లర్ ఇది. చివరి 20 నిముషాలైతే ఆడియన్ భావోద్వేగానికి లోనవుతాడు. ఇది ప్రాపర్ సీరియస్ మూవీ. రవితేజ నటన కోసం ఈ సినిమాను మళ్లీ మళ్లీ చూస్తారు' అని పేర్కొన్నారు. ఇంకా కథానాయిక ప్రియా భవానీశంకర్, మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్, సాయికుమార్, అజయ్‌ఘోష్ తదితర చిత్రబృందంతో పాటు దర్శకులు కె.ఎస్.రవీంద్ర(బాబీ), సాయిరాజేశ్, బుచ్చిబాబు, రాహుల్ సంకృత్యాన్, నిర్మాత ఎస్‌కేఎన్ తదితరులు మాట్లాడారు.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు నైజాంలో దుమ్మురేపే వసూళ్లు..

## 3 రోజుల్లోనే రూ.14 కోట్ల గ్రాస్!

సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన




'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

# భారత్‌లో 'స్పైడర్ మ్యాన్'

## వసూళ్ల సునామీ..

### రూ. 500 కోట్లు కొల్లగొట్టిన హాలీవుడ్ చిత్రం.. వరల్డ్‌వైడ్‌గా ఎంత రాబట్టిందంటే!




హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. జులై 31న విడుదలైన ఈ సినిమా, అంచనాలకు మించి భారీ విజయాన్ని నమోదు చేస్తూ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 19,120 కోట్లు) మార్క్‌ను దాటింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నుంచి 38వ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సంస్థ 'ది హాలీవుడ్ రిపోర్టర్' కథనం ప్రకారం.. ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 2.02 బిలియన్ డాలర్లను వసూలు చేసింది. కేవలం గ్లోబల్ మార్కెట్‌లోనే కాకుండా భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా ఈ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఇండియాలో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఇక్కడ అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. భారీ విజయాలు సాధించిన క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ', 'అబ్సెషన్' రికార్డులను ఇది బద్దలు కొట్టింది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి స్పైడర్ మ్యాన్‌గా అద్భుతమైన నటన కనబరిచారు. జెండయా... మిచెల్ జోన్స్-వాట్సన్ పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో స్పైడర్ మ్యాన్ ఒక కొత్త, శక్తిమంతమైన ప్రతినాయకుడిని ఎదుర్కోవడమే కాకుండా, శారీరకంగా ఊహించని మార్పులకు లోనవుతాడు. ఈ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. కెవిన్ ఫేజ్, అమీ పాస్కల్ నిర్మించిన ఈ చిత్రంలో జాకబ్ బటాలన్ (నెడ్ లీడ్స్), క్రోండన్ (టూంబ్‌స్టోన్), శాడీ సింక్ (జీన్ గ్రే) ముఖ్య పాత్రలు పోషించారు. వీరితో పాటు మార్క్ రఫెలో (హల్క్), జోన్ బెర్న్తల్ (పనిషర్), మైఖేల్ మాండో (స్కార్పియన్) వంటి ప్రముఖ నటులు కూడా ఈ సినిమాలో భాగమై అదనపు ఆకర్షణగా నిలిచారు. మొత్తం మీద 'బ్రాండ్ న్యూ డే' మార్వెల్ స్టూడియోస్‌కు మరో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిపోయింది.

# ఐటిడిఏ పాఠశాలల స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలి

**వెట్టి చాకిరీ చేయించవద్దు: యూనియన్ డిమాండ్**

**విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా నెలకు**

**రూ.10,000 ఇవ్వాలని పిఓకు వినతిపత్రం**

**సెప్టెంబర్ 1 నుంచి వంట మాత్రమే చేస్తామని హెచ్చరిక**



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) ఐటిడిఎ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు వెట్టి చాకిరీ కాకుండా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని స్వీపర్స్ & స్కావెంజర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కావెంజర్‌కు నెలకు రూ.10,000 వేతనం చెల్లించాలని కోరింది. ఈ మేరకు సోమవారం ఏటూరునాగారం ఐటిడిఎ ప్రాంగణంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం భారతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ పిఓకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ వ్యవస్థను వేతనాలతో నడుపుతున్నారని, కానీ ఐటిడిఎ పాఠశాలల్లో మాత్రం వేతనాలు చెల్లించకుండా మధ్యాహ్న భోజన వంట కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు.పిఓ వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వంట పనులు మాత్రమే చేస్తామని, శుభ్రత పనులు చేయబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఐటిడిఎ ఉపాధ్యాయులు కూడా అర్థం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో పోరెడ్డి ప్రమీల, పూలక్క, రమ, పద్మ, సమ్మయ్య, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజలు..**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ పట్టణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

### పుట్టల వద్ద ప్రత్యేక పూజలు

నాగుల పంచమి సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, పూలతో నాగదేవతలను అలంకరించి పూజలు చేశారు. పుట్టలకు పాలు పోసి, పూలు సమర్పించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం మొక్కుకున్నారు . పలుచోట్ల భక్తులకు ప్రసాద వితరణ కూడా నిర్వహించారు.

### భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉదయం నుంచే మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు చేరుకోవడంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు సైతం తల్లిదండ్రులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

### సంప్రదాయాలకు ప్రతీకగా నాగుల పంచమి

నాగుల పంచమి పండుగకు హిందూ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతిలో జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో పాముల ప్రాధాన్యతను గుర్తుచేసే ఈ పండుగను ప్రతి సంవత్సరం భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నాగదేవతలను పూజించడం ద్వారా కుటుంబానికి శుభం, ఆరోగ్యం కలగాలని భక్తులు విశ్వసిస్తారు.

# సర్వీస్ రోడ్డును మూసి వేయవద్దు

## భీమా ప్రైడ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్




మేడ్చల్( ప్రశ్న న్యూస్ )భీమా ప్రైడ్‌కు వాహనాలు రాకపోకలు సాగించడానికి ప్రధానంగా ఉపయోగపడుతున్న సర్వీస్ రోడ్ ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యల కారణంగా మూసివేయబడే పరిస్థితి ఏర్పడిందని బీమా ప్రైడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సర్వీస్ రోడ్‌ను పూర్తిగా మూసివేస్తే ఇక్కడి నివాసితులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోపించారు.భీమా ప్రైడ్‌లో సుమారు 260 ఫ్లాట్లు, మొత్తం 1200 మంది నివాసితులు, సుమారు 400 నుండి 500 వాహనాలు ఉన్నాయని తెలిపారు . ఇప్పటికే సర్వీస్ రోడ్డుపై అనధికార పార్కింగ్, చిన్న చిన్న బండ్లు, హోటళ్లు ఇతర వ్యాపార కార్యకలాపాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు.ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాల్సిన చోట కఠినంగా చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నామని,అయితే, ఆ సమస్యకు పరిష్కారంగా భీమా ప్రైడ్ నివాసితులకు ఉపయోగపడుతున్న సర్వీస్ రోడ్‌ను మూసివేయడం సరైన పరిష్కారం కాదన్నారు.ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని . పోలీస్ ట్రాఫిక్ పోలీసు శాఖ అధికారులు మా సమస్యను పరిగణనలోకి తీసుకుని, అనధికార పార్కింగ్‌ను తొలగించి, భీమా ప్రైడ్‌కు సురక్షితమైన రాకపోకల కోసం సరైన రోడ్ యాక్సెస్‌ను కొనసాగించాలని కోరారు.

# శ్రీశైలంలో శ్రావణ మొదటి ఆదివారం రికార్డు రద్దీ

**భక్తుల సౌకర్యమే లక్ష్యంగా ప్రత్యేక ఏర్పాట్లు**

**భక్తులతో నేరుగా సమస్యలు గురించి తెలుసుకుంటున్న ఆలయ ఈవో శ్రీనివాసరావు**

**మల్లన్న భక్తులకు అనుగుణంగా ప్రత్యేక సేవలు**



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) శ్రావణమాసం మొదటి ఆదివారం శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీకి హద్దే లేకుండా పోయింది.రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తెల్లవారుజాము నుండే క్యూలైన్లలో చేరి శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.ఉదయం 3 గంటలకే భక్తులు ఆలయానికి చేరుకోగా, ఉదయం 8 గంటలకు క్యూ కిలోమీటర్ పొడవు దాటింది.

ఈఓ స్వయం పర్యవేక్షణ: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు తెల్లవారుజాము నుండే క్షేత్రంలోనే ఉండి ప్రతి ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించారు. "భక్తుడే దైవం" అన్న నినాదంతో క్యూలైన్లలో నడిచి వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులను ఆయన పరామర్శించారు. ఎండ వేడిని దృష్టిలో ఉంచుకుని ప్రతి 100 మీటర్లకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేశారు.

దర్శన సమయాల వివరాలు: వేకువజాము 3:00 గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ప్రాతఃకాల పూజల అనంతరం ఉదయం 4:30 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5:30 నుండి దర్శనాలు కొనసాగుతున్నాయి. రాత్రి 8:00 గంటల తర్వాత మాత్రమే సిఫార్సు లేఖ ఉన్న విఐపి భక్తులు, ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకున్న వారికి పరిమిత స్పర్శ



దర్శనాన్ని కల్పిస్తున్నారు.

### శ్రావణ ప్రత్యేక నిబంధనలు..

శ్రావణమాసంలో ప్రభుత్వ సెలవుదినాలు, శని, ఆది, సోమవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే నేపథ్యంలో మొత్తం 19 రోజుల పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీటిలో శ్రావణ శనివారాలు, ఆదివారాలు, సోమవారాలు, వరలక్ష్మీ వ్రతం, శ్రావణ పౌర్ణమి ఉన్నాయి.ఈ 19 రోజులలో భక్తులందరికీ సంతృప్తికర దర్శనం కల్పించేందుకు గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చనలను పూర్తిగా నిలుపుదల చేశారు. అదేవిధంగా ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవ కూడా ఉండవు. ఈ రోజుల్లో వేకువజాము నుండి రాత్రి వరకు అలంకార దర్శనం మాత్రమే ఉంటుంది.

### భక్తుల ప్రశంసలు..

ఇంత రద్దీ ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం జరిగిందని, ఈఓ స్వయంగా వచ్చి మాట్లాడి ధైర్యం చెప్పారని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. "శ్రావణంలో వచ్చే ప్రతి భక్తుడు మా అతిథి. వారు ప్రశాంతంగా దర్శనం చేసుకోవడమే మా లక్ష్యం" అని ఈఓ శ్రీనివాసరావు అన్నారు.మొత్తంగా శ్రావణమాసంలో గరిష్ట సంఖ్యలో భక్తులకు సులభ దర్శనం కల్పించడమే దేవస్థానం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోక కల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ,ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో



ఘంటామఠం, విభూతిమఠం,రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# ఐటీడీఏ ముట్టడిలో ఉవ్వెత్తున ఆదివాసీ గర్జన.

**కొమురం భీమ్ జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ.**

**లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి" డిమాండ్.**

**ప్రతి గూడెం నుంచి ఐక్య పోరాటానికి నాయకుల పిలుపు.**




ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) భూమి కోసం, అడవి కోసం, అస్తిత్వం కోసం.. ఆదివాసీలు ఒక్కటయ్యారు. సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణం జై ఆదివాసీ నినాదాలతో మారుమోగింది.

కొమురం భీమ్ జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు వేలాది మంది ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో బాణాలు, తీగలతో, సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చిన గిరిజనులు తమ హక్కుల పరిరక్షణ కోసం గళం విప్పారు.

### అధికారులకు వినతి..

ర్యాలీ అనంతరం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులను కాపాడాలని, అటవీ హక్కుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం ముందు ఉంచారు. "మా రిజర్వేషన్లు, మా భూములు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు.

### ఐక్యంగా పోరాడాలి: నాయకులు.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా స్థాయి ఆదివాసీ నాయకులు ప్రతి గూడెం, ప్రతి కుటుంబం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. "ఒకటిగా ఉంటేనే మన హక్కులు సాధించుకోగలం. విడిపోతే నష్టపోయేది మనమే" అని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో ఈ ముట్టడిలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గత కొంతకాలంగా ఎస్టీ రిజర్వేషన్లు, పోడు భూముల సమస్యలు, అటవీ అధికారుల తీరుపై ఆదివాసీల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఈ ముట్టడి కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరుతున్నారు.

# ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణిలోమొత్తం 92 వినతులు వచ్చాయి.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రజావాణిలో సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు, దరఖాస్తుదారులు మొత్తం 92 అర్జీలను అధికారులకు సమర్పించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, భూసంబంధిత సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పింఛన్లు, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి పౌర సమస్యలు, ఆసరా పింఛన్లు మరియు ఇతర సంక్షేమ పథకాల పై దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని అన్ని శాఖల జిల్లా అధికారులు (డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్), కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఘన సన్మానం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. పూస గోరఖ్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముఠా గోపాల్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. డాక్టరేట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ముచ్చకుర్తి ప్రభాకర్, నాని, కిషోర్, రాము తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టపై నాగదేవతకు ఇంత నిర్లక్ష్యమా.?

- నాలా కనెక్షన్ ఇవ్వక అభిషేకానికి నీళ్లు కొనుక్కుంటున్నా వైనం
- కోట్ల అభివృద్ధి పనులు, అభిషేకానికి నీళ్లూ లేని దుస్థితి
- ఎండకు, వానకు షెడ్డు లేదు, కాళ్లు కడగడానికి నీళ్లు లేక భక్తుల ఇక్కట్లు
- 40 ఏళ్లుగా సేవ చేస్తున్న నరసమ్మకు గుర్తింపు ఎక్కడ.?
- ఈవో స్పందించేనా.? నాలుగు దశాబ్దాల సమస్యను తీర్చేనా.?







**యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) తెలంగాణ లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా** యాదగిరిగుట్టను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని పాలకులు, అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ అదే గుట్టపై భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న నాగదేవత పుట్ట గుడి పరిస్థితి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. కనీసం నాగదేవతకు అభిషేకం చేయడానికి అవసరమైన నీటి సదుపాయం(నల్ల కనెక్షన్) కల్పించలేని దుస్థితి నెలకొనడం భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది.

### అభిషేకానికి నీళ్ల కోసం ఎదురుచూపులా.?

యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పుడు, చిన్నపాటి నీటి సదుపాయం కల్పించడానికి అధికారులకు, పాలకులకు ఎందుకు ఆలోచన రాలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేవుడి సన్నిధిలో కనీస అవసరాలు కూడా లేకపోవడం వైటిడిఏ, దేవాదాయ శాఖ పనితీరుపై ప్రజల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగదేవతకు అభిషేకం చేసేందుకు, ఇతర అవసరాల కోసం భక్తులు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శనానికి వెళ్లే ముందు కనీసం కాళ్లు కూడా కడుక్కోవడానికి నీళ్లు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అదే విధంగా అభిషేకం కోసం నిర్వాహకురాలు నరసమ్మ నీళ్లు కొనుగోలు చేసి తీసుకురావడం చూస్తుంటే అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారో అర్థమవుతుందని భక్తులు మండిపడుతున్నారు.

### షెడ్డు కూడా ఏర్పాటు చేయలేరా.?

ఎండ మండుతున్నా.. వర్షం కురుస్తున్నా నాగదేవతను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. భక్తుల కోసం కనీసం ఒక షెడ్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా అధికారులకు రాకపోవడం దారుణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాదగిరిగుట్ట కోసం కోట్ల రూపాయల అభివృద్ధి పనుల్లో భాగంగా పెద్ద పెద్ద నిర్మాణాలు చేపడుతున్న అధికారులు, భక్తుల కోసం కనీస నీడ కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.




### 40 ఏళ్ల సేవకు గుర్తింపు ఎక్కడ.?

ఇక నాగదేవత ఆలయానికి సుమారు 40 ఏళ్లుగా సేవ చేస్తున్న నరసమ్మ పరిస్థితి మరింత ప్రశ్నార్థకంగా మారింది. ఇన్నేళ్లుగా ఆలయ సేవలో ఉంటూ భక్తులకు అందుబాటులో ఉంటున్న ఆమెను ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఈవోలు, దేవాదాయ శాఖ ఉద్యోగిగా గుర్తించకపోవడంపై భక్తులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆలయానికి సంవత్సరాల తరబడి సేవ చేసిన వారికి గుర్తింపు లేకపోతే, సేవకు విలువ ఏమిటని నిలదీస్తున్నారు.

### పైరవీలు ఉంటేనే గుర్తింపా.?

దేవాలయాల్లో సేవ చేసేవారికి అర్హత, అనుభవం, సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలే తప్ప పైరవీలకు మాత్రమే ప్రాధాన్యం ఉండకూడదని భక్తులు అంటున్నారు. పైరవీలు చేసిన వారికే అవకాశాలా.? అంటూ మండిపడుతున్నారు. ఇప్పటివరకు దేవాలయ శాఖలో ఎంతమంది నోటిఫికేషన్ ద్వారా నియమించబడ్డారు. నోటిఫికేషన్ లేకుండా ఎంతమంది బ్యాక్ డోర్ లో నియమించబడ్డారో పూర్తి వివరాలు ప్రజలకు తెలపాలని కోరుతున్నారు. నిజాయితీగా ఏళ్ల తరబడి దేవుడికి సేవ చేసిన వారిని మాత్రం గాలి వదిలేయడమేనా.? అని ప్రశ్నిస్తున్నారు.

### దేవాదాయ శాఖ ఇకనైనా మేల్కొంటుందా.?

హిందూ దేవాలయాల పరిరక్షణ, భక్తుల సౌకర్యాల కల్పన, ఆలయ సేవకుల సమస్యల పరిష్కారం దేవాదాయ శాఖ బాధ్యత. అయితే నాగదేవత పుట్ట గుడి విషయంలో కనీస సౌకర్యాల లేమి, సేవ చేస్తున్న వ్యక్తికి గుర్తింపు లేకపోవడం వంటి అంశాలు అధికారుల పనితీరును ప్రశ్నించేలా చేస్తున్నాయి. యాదగిరిగుట్టను ప్రపంచస్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న ప్రజా ప్రతినిధులు గుట్టపై ఉన్న చిన్న ఆలయాల పరిస్థితిని కూడా ఒకసారి పరిశీలించాలి. నాగదేవత ఆలయానికి తక్షణం నీటి సదుపాయం, భక్తుల కోసం షెడ్డు ఏర్పాటు చేయడంతో పాటు, దశాబ్దాలుగా సేవ చేస్తున్న నరసమ్మ సేవలను గుర్తించి న్యాయం చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఈవో, వైటిడిఏ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తారా.? లేక ఈ ఆలయం కూడా నిర్లక్ష్యపు చీకట్లోనే మగ్గాల్సిందేనా.? అన్నది వేచి చూడాలి.

# పేదల బియ్యం.. మాఫియా చేతికి.?

## - ప్రభుత్వ పథకం దళారుల పాలు

- జిల్లాల నుండి అక్రమంగా తరలి వెళ్తున్న పేదల బియ్యం
- రేషన్ బియ్యం అక్రమ దందా ను అరికట్టాలని డిమాండ్లు
- పెద్ద అంబర్పేట్, హయత్ నగర్, చంపాపేట్, బాలాపూర్, జలపల్లి, మంగళ్ పల్లి (బొంగులూరు గేట్), తుర్కయంజాల్ కట్టకింద, షామీర్పేట్, చర్లపల్లి, జవహర్ నగర్, సిద్దిపేట లోని రామారాం, మేడ్చల్ లలో రేషన్ బియ్యం దందా గోడౌన్లు






మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేదల రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకం దళారుల పాలవుతూ కోట్ల దందా నడుస్తుందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మేడ్చల్ మల్కాజ్గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుండి ఇతర రాష్ట్రాలకు సివిల్ సప్లై అధికారుల సహాయ సహకారాలతో పేదల బియ్యం ను తరలిస్తూ కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. శామీర్పేట నుండి 270 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రమైన గుజరాత్ కు తరలిస్తుండగా మేడ్చల్ జిల్లా డబిల్ పూర్ గ్రామంలో వద్ద 44 జాతీయ రహదారిపై పోలీసులు పౌర సరఫరాల అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేశారంటే ఎంత తీవ్రంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లాలలో జోరుగా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిపోతుంది అనడానికి ఈ ఘటననే ఉదాహరణగా చెప్పవచ్చు. కొంతమంది అధికారుల కనుసైగల్లో పేదల నోట్లో మట్టి కొడుతూ వారికి కేటాయించాల్సిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలు మూడు పూటలు కడుపునిండా తినాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక మంచి సంకల్పంతో ఉచితంగా పీడిఎస్ బియ్యాన్ని అందిస్తుంటే 3 నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో దళారులు పక్కదారి పట్టించడం క్షమించరాని నేరంగా భావించాల్సి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిపై సివిల్ సప్లై కమిషనర్ కఠినంగా వ్యవహరిస్తేనే ఈ దందా ఆగుతుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

### గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న దందా

ముఖ్యంగా రంగారెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలలో రేషన్ బియ్యం దందా గుట్టు చప్పుడు కాకుండా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రేషన్ బియ్యం దందా ను అరికట్టేందుకు కొంతమంది అధికారులు మాత్రమే ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ అక్రమ దందా మాత్రం ఆగడం లేదని విమర్శలు ఉన్నాయి. ఎందుకంటే సివిల్ సప్లై అధికారులు కొంతమంది ఈ దందాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ భారీ స్థాయిలో మామూళు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సప్లై శాఖలో కేవలం సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు మాత్రమే వీటికి అడ్డుకట్ట వేస్తున్నారు. కొన్ని జిల్లాలలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు కూడా మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక పక్క ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ అక్రమ రేషన్ బియ్యం దందాకు అసలు బ్రేకులు పడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకపక్క పోలీసులు, పౌర సరఫరా శాఖ అధికారులు, ఎస్ఓటి పోలీసులు రేషన్ దందాపై దాడులు చేస్తున్నప్పటికీ దందా మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా హద్దు అదుపు లేకుండా షరా మామూలే అన్న చందంగా తయారైంది.

### మొదటి వారంలోనే దందా కొనసాగింపు

ప్రతినెల మొదటి వారంలోనే అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదటి వారంలోనే ప్రభుత్వం ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తుంది. ఇదే సమయంలో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తామంటూ దళారులు ఇంటింటికి వెళ్లి దందాకు తెర లేపుతున్నారని విమర్శలు ఉన్నాయి. అదే కాకుండా చాలా వరకు డైరెక్ట్ గా డీలర్ల నుండి బస్తాలు సరఫరా అవుతున్నాయని దానికి తోడు ఏకంగా గోడౌన్ లో నుండి కూడా అక్రమంగా మాఫియా చేతికి రేషన్ బియ్యం వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఉచితంగా వచ్చిన రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రైస్ మిల్లులకు అమ్ముకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### పీడీ యాక్ట్ పెడుతున్న జంకని దళారులు

రేషన్ బియ్యం పక్క దారి పట్టిస్తే పీడీ యాక్ట్ పెడతామని అధికారులు హెచ్చరించిన దళారులు జంకడం లేదని తెలుస్తుంది. ముఖ్యంగా పెద్ద అంబర్పేట్, హయత్ నగర్, చంపాపేట్, బాలాపూర్, జలపల్లి, మంగళ్ పల్లి (బొంగులూరు గేట్) తుర్కయంజాల్ కట్టకింద, షామీర్పేట్, చర్లపల్లి, జవహర్ నగర్, సిద్దిపేట లోని రామారాం, మేడ్చల్ లలో రేషన్ బియ్యం దందా గోడౌన్లు చాలా ఉన్నాయి. వీటిపై గతంలో సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్న తిరిగి రెండు రోజులకె దండ ఎదేచ్ఛగా నిర్వహించడం జరుగుతుందని ఇక ఆగస్టు నెల లో 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వడంతో ఈ దందా మరింత జోరుగా సాగుతుందని అయినా సివిల్ సప్లై అధికారులు ఇప్పటివరకు అదే గోడౌన్ లో అడ్డాలపై దాడి చేయకపోవడం పలు అనుమానాలకు తాగేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుండి కొనుగోలు చేస్తే రైస్ మిల్లులకు తాళం వేస్తామని పౌర సరఫరాల శాఖ హెచ్చరించిన పరిస్థితుల్లో కూడా అసలు మార్పు రావడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలలో సేకరించిన పేదల బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారని, అక్రమ రేషన్ బియ్యం తరలింపు దందాపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని సంబంధిత అధికారుల నిఘా పెంచి దళారుల ఆటలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 50 మందిపై ఎన్టీఏ వేటు

## - కీలక స్థానాల్లో నూతన నియామకాలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పరీక్ష లీకేజీ నేపథ్యంలో 50 మందికి పైగా సిబ్బందిని తొలగించిన జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), కీలకమైన నాయకత్వ స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఇటీవల నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్షల్లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌తో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఐఎస్ఓ) వంటి 10 కీలకమైన పదవుల భర్తీకి నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించింది. సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి విభాగాల్లో ప్రైవేట్ రంగ నిపుణులను కూడా నియమించుకుంటున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. పరీక్షల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను అత్యంత కఠినంగా పాటించాలని కేంద్రమంత్రి అధికారులను ఆదేశించారు. రహస్య కార్యకలాపాల వ్యవస్థను, ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్‌లు, ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ వంటి భద్రతా ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిగా ఆధునికీకరించాలని సూచించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించి, చేపట్టిన దిద్దుబాటు చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఎన్టీఏను ఆదేశించారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

## - 14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన

# ప్రశాంత్ కిషోర్



పాట్నా: జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో పోటీ చేసిన పీకే.. ఎవరూ ఊహించని రీతిలో విజయం ఢంకా మోగించి.. బిహార్ అసెంబ్లీలో అడుగుపెట్టారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588